ఈనాడు
సిద్దిపేట
సోమవారం అక్టోబరు 7, 2024


సంబరాల్లో పాల్గొన్న బల్దియా అధ్యక్షురాలు మంజుల, కౌన్సిలర్ దీప్తి


కోమటిచెరువులో నిమజ్జనాలు


ట్రాలీపై పది అడుగుల బతుకమ్మ

అణువణువునా బతుకమ్మ శోభ

సిద్దిపేట టౌన్: జిల్లాలో బతుకమ్మ సంబురాలు వైభవోపేతంగా కొనసాగుతున్నాయి. పట్టణంలో దాసాంజనేయ ఆర్యవైశ్య ఫ్యామిలీ అసోసియేషన్ ఆధ్వర్యంలో 10 అడుగుల బతుకమ్మను తయారుచేశారు. కోలాటాలు ఆడుతూ శోభాయాత్ర నిర్వహించి కోమటిచెరువులో నిమజ్జనం చేశారు. బల్దియా అధ్యక్షురాలు కడవేర్గు మంజుల దంపతులు, అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు అయిత రత్నాకర్, సురేశ్, ఆర్యవైశ్యభవన్ అధ్యక్ష, కార్యదర్శులు అయిత బాల్‌రాజేశం, పోశెట్టి శ్రీకాంత్ పాల్గొన్నారు. ఎమ్మెల్యే హరీశ్‌రావు క్యాంపు కార్యాలయంలో సంబరాలు నిర్వహించారు.

యువజనోత్సవం.. ప్రత్యేకత సొంతం

జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఇటీవల సిద్దిపేటలో నిర్వహించిన యువజనోత్సవాల్లో పలువురు తమదైన ప్రదర్శనలతో సత్తా చాటారు. ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ఈ నేపథ్యంలో యువత, విద్యార్థులు నచ్చిన రంగంలో రాణిస్తున్న తీరు, అందుకు శ్రమిస్తున్న విధానంపై 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం.. – న్యూస్‌టుడే, సిద్దిపేట

సాధనతో స్పందన..



చిత్ర కళపై చిన్నప్పటి నుంచే ఆసక్తి పెంచుకుంది సిద్దిపేటకు చెందిన వేముల స్పందన. ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో బైపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. వివిధ రంగాల్లో రాణిస్తున్న వృత్తుల వారి చిత్రాలను యువజనోత్సవ పోటీల్లో గీసి ప్రత్యేకత చాటారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికవడం ఇదే మొదటిసారి. సమకాలీన అంశాలకు చిత్ర రూపం ఇస్తున్నారు. ప్రిన్సిపల్ డి.రాణి, అధ్యాపకుల ప్రోత్సాహం మరువలేనిది, చిత్రకారిణిగా గుర్తింపు సాధించేందుకు శ్రమిస్తానని స్పందన వెల్లడించారు.

నృత్యాభినయం.. సమష్టి తత్వం


విద్యార్థినుల ప్రదర్శన

సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్‌పల్లి టీజీ ఆర్ఎస్-సీ విద్యార్థినులు చదువుతో పాటు ఆటపాటల్లో సత్తా చాటుతున్నారు. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాలకు చెందిన నిఖిత, నందిని, గగన, దివ్య, కె.వైష్ణవి, నిధి, సౌమ్యశ్రీ, పల్లవి, శ్రావణి, జ్యోతి బృందం.. జానపద నృత్యంతో అదరగొట్టారు. ఐదు నిమిషాల వ్యవధితో లంబాడి నృత్యం నిర్వహించి సబికులతో పాటు న్యాయ నిర్ణేతలను మంత్రముగ్ధులను చేశారు. ప్రిన్సిపల్ విష్ణువర్ధన్‌రెడ్డి, అధ్యాపకులు వీరిని ప్రత్యేకంగా ప్రోత్సహించారు. గతంలోనూ రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటారు.

స్వతహాగా సాహితీ..




జానపద నృత్యం (సోలో) సిద్దిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ఇంటర్ ద్వితీయ సంవత్సరం (కంప్యూటర్ సైన్స్) విద్యార్థిని కె.సాహితీ ప్రథమ స్థానంలో నిలిచారు. స్వతహాగా నేర్చుకొని నృత్యంలో రాణిస్తుండటం విశేషం. 'మడి మీద మడి గజ్జెల వాడి' పాటపై నృత్యంతో అలరించారు. తల్లి చంద్రకళ ప్రోత్సాహంతో పాఠశాల, జిల్లా స్థాయిలో అనేక పోటీల్లో పాల్గొన్నారు. దాదాపు మూడుసార్లు ప్రథమ స్థానంలో నిలిచారు. ప్రిన్సిపల్ సత్యనారాయణరెడ్డి ప్రోత్సాహం మరువలేనిదని, ఉత్తమ కొరియోగ్రాఫర్‌గా ఎదగడమే తన లక్ష్యమని సాహితీ చెబుతున్నారు.

జానపదంలో మెరిసిన శివ



దుబ్బుల కళాకారుడు శివ జానపద గీతం విభాగంలో 'దుర్గమ్మ కొలుపు కళ'ను ప్రదర్శించారు. ఆరో తరగతి నుంచే తన తండ్రి శంకర్ ద్వారా ఈ కళ అబ్బింది. వీరి స్వస్థలం నారాయణరావుపేట మండలం బంజేరుపల్లి. 2022లో డిగ్రీ పూర్తి చేశారు. ఇంటర్ నుంచే జానపద గీతాలు రాయడం, పాడటం సహా నిర్మిస్తున్నారు. యూట్యూబ్ ఛానెల్ నిర్వహిస్తున్నారు. గత ఏడాది దుర్గమ్మ కొలుపు కళతో జాతీయ స్థాయికి ఎంపికై నాలుగో స్థానంలో నిలిచారు. ఈ సారి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు.

శ్రీగౌరీదేవిగా సరస్వతిమాత దర్శనం



సకల విద్యలకు అధిష్ఠాన దేవతైన సరస్వతిమాత ఆదివారం వర్గల్ విద్యాధరి క్షేత్రంలో శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా శ్రీగౌరిదేవిగా అలంకృతమై భక్తులకు దర్శనమిచ్చింది. క్షేత్ర వ్యవస్థాపక చైర్మన్ యాయవరం చంద్రశేఖరశర్మ నేతృత్వంలో వైభవోపేతంగా ఉత్సవాలు జరుగుతున్నాయి. అమ్మవారిని లక్ష గాజులతో విశేషంగా అలంకరించారు. శ్రీచక్ర చతుష్షష్టి పూజలు, హవనాలు, అక్షరస్వీకారాలు, అన్నప్రాశనలు క్షేత్రంలో జరిగాయి.

– న్యూస్‌టుడే, వర్గల్

వృత్తి నైపుణ్యంపై విద్యార్థులకు అవగాహన


వెల్డింగ్ పనులపై విద్యార్థులకు వివరిస్తున్న నిర్వాహకులు

వర్గల్: సాంకేతిక విప్లవంతో మరుగున పడుతున్న వృత్తి నైపుణ్యాల విద్యను విద్యార్థులకు అలవాటు చేయడమే ధ్యేయంగా సంచికి దూరం కార్యక్రమం నిర్వహించి పలు అంశాలపై అవగాహన కల్పిస్తున్నట్లు నవోదయ విద్యాలయం ప్రిన్సిపల్ రాజేందర్ పేర్కొన్నారు. గత మూడు రోజులుగా కొనసాగుతున్న 'బ్యాగ్ లెస్ డే' కార్యక్రమంలో భాగంగా ఆదివారం విద్యార్థులకు పతంగుల తయారీ, గోడలపై చిత్రాలు గీయడం, వ్యవసాయంలో సహాయం చేయడం, కుట్లు, అల్లికలు, గోరింటాకు వేయడం, వెల్డింగ్ పనులలో విద్యార్థులకు మెలకువలు కల్పించారు. పూర్వ విద్యార్థి వి.రామకృష్ణ విద్యార్థులకు మోటివేషన్ తరగతులు నిర్వహించారు.

గాడి తప్పుతున్న మొక్కజొన్న వ్యాపారం

న్యూస్‌టుడే, హుస్నాబాద్: ఆరుగాలం శ్రమించి పంట పండించిన రైతులను కొందరు వ్యాపారులు తరుగు, హమాలీ పేరిట దోచుకుంటున్నారు. నానా కష్టాలు పడి పంటలు పండించి చేసిన పెట్టుబడుల అప్పులు, పండుగ అవసరాలను తీర్చుకోవడానికి వ్యవసాయోత్పత్తులను విక్రయించడానికి వస్తున్న రైతులను హుస్నాబాద్‌లో అదుపు లేకుండా కొందరు దందా చేస్తున్నారు. కొద్ది రోజులుగా ఈ వ్యవహారం సాగుతున్నా పట్టించుకునే వారు కరవయ్యారు. నాలుగు జిల్లాలకు మధ్య ఉన్న హుస్నాబాద్ పట్టణంలో ధాన్యం, మొక్కజొన్న, పత్తి పంటలను వ్యాపారులు కొంటారు. ప్రభుత్వ సంస్థలు ఇంకా కొనుగోళ్లు ప్రారంభించలేదు. ఈలోపు వ్యాపారులకు కర్షకులు విక్రయించుకుంటున్నారు.



తరుగు పేరిట రైతుకు నష్టం

హుస్నాబాద్‌లో పెద్ద వ్యవసాయ విపణి ఉన్నా క్రయ విక్రయాలు జరుగవు. వ్యాపారులే తమ దుకాణాల ముందు కొనుగోళ్లు చేస్తారు. మొక్కజొన్న పంటను అమ్ముకొవడానికి వస్తున్న రైతులను తరుగు పేరిట తీస్తున్నారు. వ్యాపారికి అప్పగిస్తే వాటికి తూకం పేరిట క్వింటాలుకు రెండున్నర కిలోల తరుగు తీస్తున్నారు. హమాలీ పేరిట రెట్టింపు ఛార్జీలు కోత పెడుతున్నారు. పత్తి కొనుగోళ్లలోనూ క్యాష్ కటింగ్ పేరిట ఒక శాతం కోత విధిస్తున్నారు. ఇటీవల ఒక రైతు మార్కెట్ పరిధిలో కొండాపూర్‌లో వ్యాపారి వద్ద విక్రయించి మొక్కజొన్నల్లో తరుగు పేరిట భారీగా కోత విధించిన విషయాన్ని ఒక రైతు మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకువెళ్లారు. వ్యాపారిపై ఫిర్యాదు చేస్తే చట్టపరమైన చర్యలకు సిఫారసు చేస్తామన్నారు. వ్యాపారులకు విక్రయించి నష్టపోవద్దని సూచించారు. వ్యవసాయోత్పత్తుల సీజన్ ప్రారంభమై 15 రోజులు కావస్తోంది. మార్కెటింగ్ శాఖ ఎలాంటి చర్యలు చేపట్టలేదు.

గజ్వేల్ ఎమ్మెల్యే కనిపించడం లేదంటూ ఫిర్యాదు

గజ్వేల్ గ్రామీణ: గజ్వేల్ ఎమ్మెల్యే కేసీఆర్ కనిపించడం లేదని, ఆచూకీ తెలపాలంటూ కాంగ్రెస్ అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్ రావు ఆదివారం గజ్వేల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రిగా 10 సంవత్సరాలు గజ్వేల్ ప్రజలకు అందుబాటులో ఉండని కేసీఆర్.. ప్రస్తుతం ప్రతిపక్ష నాయకుడు, గజ్వేల్ ఎమ్మెల్యే అయినా ఉండటం లేదన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి ఎన్.యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

'కేసీఆర్‌ను విమర్శించే స్థాయి కాంగ్రెస్‌కు లేదు'

గజ్వేల్: తన ప్రాణాలు పణంగా పెట్టి తెలంగాణను సాధించి ప్రజల గుండెల్లో నిలిచిన వ్యక్తి కేసీఆర్ అని ఆయనను విమర్శించే స్థాయి కాంగ్రెస్ నాయకులకు లేదని భారాస సీనియర్ నేత, ఎఫ్‌డీసీ మాజీ ఛైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. ఆయన ఆదివారం గజ్వేల్‌లో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రాజెక్టులు నిర్మించి తెలంగాణలో కరవుకు తావు లేకుండా చేశారన్నారు. గద్దెనెక్కిన కాంగ్రెస్ నాయకులు కేసీఆర్, హరీశ్‌రావు, కేటీఆర్‌లను విమర్శించటమే పాలనగా సాగుతున్నారన్నారు. గజ్వేల్ అభివృద్ధికి మంజూరు చేసిన రూ.170 కోట్లు కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. మున్సిపల్ ఛైర్మన్ ఎన్సీ రాజమౌళి, ఏఎంసీ మాజీ ఛైర్మన్ మాదాసు శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

నీ నీడ కావాలి.. వేప చెట్టు తల్లీ


మొక్క నాటుతున్న నాయకులు, గ్రామస్థులు

బెజ్జంకి: దశాబ్దాల పాటు నీడనిచ్చి సేదతీర్చిన వేప చెట్టు.. భారీ వర్షాలకు నేల కూలడంతో స్థానిక ప్రజల మనసు కకావికలమైంది. చెట్టు జ్ఞాపకాలను, అది అప్పటివరకు ఉన్న స్థలాన్ని ప్రజలు గుర్తు చేసుకుంటూ చర్చించుకున్నారు. వేప చెట్టు విలువను గుర్తించారు. అందుకే చక్కటి పని చేశారు. వృక్షం కూలిపోయిన స్థలంలోనే మళ్లీ నాటారు. బెజ్జంకి మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయ ఆవరణలో వేప చెట్టు ఉండేది. ప్రయాణికులకు, చిరు వ్యాపారులకు, కార్యాలయానికి వచ్చిన వారికి నీడనిచ్చింది. అది కూలిపోవడంతో ఆవేదనకు గురి చేసింది. ఆదివారం అదే స్థలంలో పాత చెట్టు వేర్లు తొలగించి, గుంత సరిచేసి వేప మొక్కను నాటారు. అర్చకుడి ఆధ్వర్యంలో మొక్కకు కొబ్బరికాయ కొట్టి, పూజలు నిర్వహించారు. మాజీ సర్పంచులు నర్సయ్య, శ్రీనివాస్, రత్నాకర్‌రెడ్డి, దామోదర్, లక్ష్మీనారాయణ, రాజేశం, లక్ష్మణ్, నారాయణరెడ్డి, శ్రీనివాస్, రమేశ్, గ్రామస్థులు పాల్గొన్నారు.

8న సిద్దిపేటకు 'సీఎం కప్' ర్యాలీ

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నవంబరులో నిర్వహించనున్న సీఎం కప్-2024 క్రికెట్ కప్‌కు సంబంధించి టార్చ్ రిలే (క్రీడాజ్యోతి) మంగళవారం సిద్దిపేటకు చేరుకోనుంది. ఈనెల 3న సీఎం రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌లో క్రీడాజ్యోతిని ప్రారంభించగా రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో టార్చ్ రిలే ర్యాలీ కొనసాగుతోందని జిల్లా యువజన క్రీడల శాఖ మేనేజర్ వెంకటేశ్వర్‌గౌడ్ తెలిపారు. రామంచ వద్ద రిలే బృందం జిల్లాకు చెందిన క్రీడాకారులకు జ్యోతిని అందించనున్నారు. తోటపల్లి వద్ద కరీంనగర్ జిల్లా క్రీడాకారులకు జ్యోతి అందించనున్నారు.

బడి నిర్వహణకు సురక్ష కమిటీ


పెరికలగడ్డ పాఠశాలలో కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు

కోహెడ గ్రామీణం, న్యూస్‌టుడే: పాఠశాల పిల్లలకు క్రీడా దుస్తులు, డ్రాయింగ్ కాగితాలు, ఇతరత్రా సామగ్రి అవసరమైతే ఒక్కోసారి ఖాతాలో డబ్బులు ఉండని పరిస్థితి నెలకొంటుంది. కార్యక్రమాలేవీ కుంటుపడకుండా పాఠశాల నిర్వహణ ముందుకెళ్లేలా కోహెడ మండలం వింజపల్లి గ్రామపంచాయతీ పరిధి పెరికలగడ్డ ప్రాథమిక పాఠశాల వారు వినూత్న ఆలోచన చేశారు. ప్రభుత్వ సహకారం, ప్రజల భాగస్వామ్యంతో బడి అభివృద్ధికి ఉపాయం చేశారు. తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు 12 మందితో కలిసి నెల క్రితం 'పాఠశాల సురక్ష కమిటీ' ఏర్పాటైంది. బ్యాంకు ఖాతాతో పాటు దాతలు డబ్బులు ఇవ్వడానికి క్యూఆర్ కోడ్ రూపొందించారు. బడిలో 45 మంది విద్యార్థులున్నారు. తోచినంత నగదును బడి అభివృద్ధికి ఇచ్చేలా ఏర్పాటు చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

గజ్వేల్ గ్రామీణ: గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని రాజీవ్ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. గజ్వేల్ సీఐ సైదా తెలిపిన వివరాలు.. రాయపోల్ మండలం ముంగీసుపల్లికి చెందిన కొత్త శివ (18) గజ్వేల్ పట్టణంలోని ఓ వస్త్ర దుకాణంలో పనిచేస్తున్నాడు. అతడికి తల్లిదండ్రులు, సోదరుడు ఉన్నారు. ఆదివారం గౌరారం నుంచి ప్రజ్ఞాపూర్‌కు వస్తుండగా శివ నడుపుతున్న ద్విచక్ర వాహనం అదుపుతప్పి కింద పడటంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

జూదశిబిరంపై దాడులు.. 8 మంది అరెస్టు

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: సిద్దిపేట పట్టణంలోని ఓ ఇంట్లో జూద శిబిరంపై ఆదివారం సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, వన్‌టౌన్ పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. దాడిలో 8 మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.2,97,850 స్వాధీనం చేసుకున్నారు. వన్‌టౌన్ ఎస్సై నరసింహారావు తెలిపిన వివరాలు.. పట్టణంలోని శివాజీనగర్‌లో ఓ ఇంట్లో జూదమాడుతున్నారన్న సమాచారంతో ఆదివారం రాత్రి తమ సిబ్బంది దాడులు చేశారు. ఈ సందర్భంగా పట్టణానికి చెందిన ఎనిమిది జూదరులను అరెస్టు చేసి, సదరు నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.

ఆదమరిస్తే ప్రమాదకరం

న్యూస్‌టుడే, హుస్నాబాద్ గ్రామీణం, కోహెడ, రాయపోల్:

రహదారులు నిర్మించిన కొద్ది నెలలకే భారీ వర్షాలకు శిథిలమవుతున్నాయి. మరమ్మతులకు గురవుతున్నాయి. ప్రజల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అక్కన్నపేట మండలం రామవరం గ్రామ సమీపంలో రోడ్డు ప్రమాదకరంగా మారింది. గత నెలలో కురిసిన భారీ వర్షాలతో గ్రామ పరిధిలోని కుంటకు గండిపడింది. వరదంతా నందారం స్టేజీ నుంచి రామవరం వెళ్లే రోడ్డుపై నుంచి ప్రవహించింది. మధ్యం దుకాణం వద్ద రోడ్డు కోతకు గురైంది. ఏమాత్రం ఆదమరిచినా వాహనాలు అందులో పడొచ్చు. రాత్రిపూట మరీ ప్రమాదకరం. నెల రోజులు గడుస్తున్నా దీనిని పట్టించుకునే వారు కరవయ్యారు. ఈ మార్గాన్ని రెండు వరుసలుగా మార్చేందుకు నిధులు మంజూరయ్యాయని.. తాత్కాలిక మరమ్మతులు చేయిస్తామని ఆర్అండ్‌బీ ఏఈ సాజిద్ తెలిపారు. సిద్దిపేట-హుస్నాబాద్ జాతీయ రహదారి నాగసముద్రాల స్టేజి పక్కనే ఉన్న తారు రహదారి పక్కన మట్టి కొట్టుకుపోయి గుంతలు ఏర్పడ్డాయి. జాతీయ రహదారి పనులు చేస్తున్న గుత్తేదార్లు మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.


రామవరంలో కోతకు గురైన రోడ్డు

నిధులున్నా.. మొదలు కాలే..

రాయపోలు మండలం వడ్డేపల్లి సమీపంలోని గుర్రాలసోఫా నుంచి నాచారం రోడ్డు పూర్తిగా గుంతల మయంగా మారింది. ఈ గుంతలలో నీరు నిలిచి వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. నిర్మాణానికి నిధులు మంజూరై తొమ్మిది నెలలు గడిచాయి. పనులు మొదలు పెట్టలేదు. రాయపోల్ పెద్దమ్మ గుడి నుంచి తిర్మలాపూర్ రోడ్డు నిర్మాణానికి రూ.3 కోట్లు మంజూరయ్యాయి. రాయపోల్ నుంచి తిర్మలాపూర్ గ్రామాల మధ్య మట్టి రోడ్డు పోసి దశాబ్దం దాటి పోయింది. రాయపోల్ నుంచి తిర్మలాపూర్, గొల్లపల్లి, రామారం తదితర గ్రామాలకు నేరుగా రోడ్డు సౌకర్యం లేదు. తిర్మలాపూర్ వెళ్లాలంటే తిమ్మక్కపల్లి, హైమద్‌నగర్ మీదుగా తిరిగి వెళ్లాల్సి వస్తుంది. గొల్లపల్లి, రామారం వెళ్లాలంటే ఉదయపూర్ మీదుగా తిరిగి వెళ్లాల్సి ఉంటుంది. పన్నెండేళ్ల క్రితం సుమారు నాలుగు కిలోమీటర్ల మట్టి రోడ్డు పోశారు. కల్వర్టులను నిర్మించారు. ఇది తారు రోడ్డుగా మారుతుందని ప్రజలు భావించారు. ప్రజల అవస్థలు చూసి స్థానిక నాయకులు ఆరు నెలల క్రితం కొంత మొరం పోయించినా ఫలితం లేదు. నిర్మాణ పనులకు టెండర్లు పూర్తి కాలేదని. పూర్తి చేసి ప్రారంభిస్తామని రాయపోల్ పీఆర్ఏఈ రామ్‌కుమార్ చెప్పారు.


రాయపోల్-తిర్మలాపూర్ మార్గం ఇలా..

నిధుల లేమి.. మరమ్మతులేవీ?

న్యూస్‌టుడే, హుస్నాబాద్: హుస్నాబాద్ ఎల్లమ్మచెరువు నిర్వహణపై నీటిపారుదల శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. రెండు పంటలకు సాగునీరందిస్తూ ఈ ప్రాంతంలోనే పేరొందిన ఎల్లమ్మ చెరువు 500 ఎకరాల విస్తీర్ణంలో ఉండి 15 అడుగుల నీటి నిల్వ సామర్థ్యం కలిగి ఉంది. ప్రత్యక్షంగా 2 వేల ఎకరాలకు సాగునీరందిస్తుండగా పరోక్షంగా మరో వెయ్యి ఎకరాలకు సాయపడుతోంది. పట్టణానికి తాగు నీరు ఇస్తోంది. వేసవి కాలం నుంచి ఈ వర్షాకాలం వరకు తూముల నుంచి చెరువు నీరు లీకేజీలతో వృథాగా పోతోంది. ఎల్లమ్మ చెరువును దాదాపు ఏడేళ్ల క్రితం మిషన్ కాకతీయలో మరమ్మతు పనులు చేపట్టారు. చెరువు కట్ట, లీకేజీ తూములు సరిచేశారు. ఒక కొత్త తూమును నిర్మాణం చేయగా, రామవరం రోడ్‌వైపు మరమ్మత్తు చేశారు. మూడున్నర ఏళ్ల క్రితం చెరువు తూము కుంగిపోయి ధ్వంసమైంది. అప్పుడు మరమ్మతులు చేశారు.


హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు

లీకేజీ ఆపడానికి ఆపసోపాలు

గత వేసవిలో చెరువులో నీరు ఉండగా రామవరం రోడ్ వైపు ఉన్న తూము షట్టర్లను తీసి బయటకు వదిలారు. మోటార్లు పెట్టి, కాలువలు తీసి వదిలినా అధికారులు ఉదాసీనంగా వ్యవహరించారు. అప్పట్లో రైతులు, వివిధ రాజకీయ పక్షాలు ఆందోళన వ్యక్తం చేశాయి. నీటిని వదలకుండా చర్యలు చేపట్టారు. ప్రస్తుతం లీకేజీతో నీరు వృథాగా పోతోంది. పంట పొలాల్లోకి చేరి అవి దెబ్బతింటున్నాయి. లీకేజీని అరికట్టేందుకు అన్నదాతలు యత్నించినా ఆగలేదు. అనంతరం మట్టి పోసి ఆపారు. షట్టర్ సరిగా పనిచేయడం లేదు. ఇసుక బస్తాలు వేసి వృథాను కొంత నిలువరించారు. మరమ్మతులకు తమ వద్ద నిధులు లేవని నీటిపారుదల శాఖ కార్యనిర్వాహక ఇంజినీరు రాములునాయక్ తెలిపారు. లీకేజీల నివారణకు యుద్ధప్రాతిపాదికన చర్యలు చేపట్టడానికి స్థానికంగా సహకారం తీసుకున్నామన్నారు. చెరువులో నీరు తగ్గినపుడు మరమ్మతులు చేపట్టే అవకాశం ఉందన్నారు.

పార్కులో ఆహ్లాదం దూరం



కొండపాక మండలం మర్పడ్గ శివారు ఆక్సిజన్ పార్కులో చేయి ఆకారంలోని బొమ్మ విరిగిపోయి పడి ఉంది. ఆహ్లాదంగా ఉండాల్సిన పార్కు కళావిహీనంగా మారింది. నమూనాను బాగు చేయాలని పర్యాటకులు కోరుతున్నారు. సెలవులు, ఆదివారాల్లో 30 మందికి పైగా సందర్శకులు ఈ పార్కుకు వచ్చి గడుపుతారు.

– న్యూస్‌టుడే, కొండపాక గ్రామీణం

ప్రకృతి ఆరాధనే.. బతుకమ్మ..

బతుకమ్మ పూల పండగ.. ప్రకృతిని ఆరాధించే వేడుక.. మనుషుల మధ్య బంధాన్ని పెంచడంతో పాటు అందరి బతుకును కోరుకుంటుంది. ఇదే బతుకమ్మ పరమార్థం. ఇందులో ఉండే విశేషాలు, పాటల్లో ఉండే అంశాలు ప్రజలకు తెలియజెప్పే లక్ష్యంతో పలువురు దీనిపై అధ్యయనం చేశారు. ఆయా విశేషాలు ఇలా..

- న్యూస్‌టుడే, సిద్దిపేట, చేర్యాల

28 ఏళ్లుగా పరిశోధన..



పాడి పంటలు, పర్యావరణంతో ముడిపడిన పండగ బతుకమ్మ అని అంటారు సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు సహ ఆచార్యులు డా. మట్ట సంపత్‌కుమార్‌రెడ్డి. స్వస్థలం కరీంనగర్. 2022లో ఇల్లంతకుంట ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకుడిగా ప్రస్థానం మొదలైంది. తెలంగాణ భాష, సాహిత్యం, సంస్కృతి అంటే అమితాసక్తి. 2014లో తెలంగాణ కథా సాహిత్యం-స్థానికతపై పీహెచ్‌డీ పూర్తి చేశారు. 1996లో బతుకమ్మ, జానపద పాటలపై పరిశోధన ఆరంభించారు. 28 ఏళ్లలో 60కి పైగా పరిశోధన పత్రాలు సమర్పించారు. 200కి పైగా బతుకమ్మ పాటల్లోని అంశాలను అధ్యయనం చేసి ఎన్నో విషయాలు వెల్లడించారు. వ్యవసాయం, ఆడబిడ్డ, పర్యావరణం, చరిత్ర, స్త్రీ పురుష సంబంధాలు, మానవీయ, ప్రకృతి, జీవకోటి, ఆహారం అటవీ, జల వనరుల అంశాల్లో ముడిపడి ఉన్నట్లు స్పష్టం చేశారు. ఇటీవల గంగ దర్వాజ పేరిట పుస్తకం వెలువరించారు. బతుకమ్మ పాటల పుస్తకం ఆవిష్కరణకు సిద్ధమయ్యారు.

పండగ అంతరార్థం ఇది..: సృష్టిలో ఏ ప్రాణికైనా సంతానోత్పత్తి ప్రధమ ఆశయం. పూలు పరపరాగ సంపర్కం జరిపి సృష్టికి సిద్ధమైన తరుణంలో తెలంగాణ సమాజం పూలకు జరిపే పండుగే బతుకమ్మ. సమస్త జీవకోటికి అనుసంధానించే వేడుకగా అభివర్ణించవచ్చు. బొడ్డెమ్మ.. ఎదుగుతున్న స్త్రీకి సంకేతం. బతుకమ్మ.. ఎదిగి పెళ్లి పేరంటం చేసుకున్న స్థితికి సంకేతం. **డా. మట్ట సంపత్‌కుమార్‌రెడ్డి**

గుర్తించారిలా..

● ఈ పండగ.. స్త్రీ తత్వం గొప్పతనాన్ని చాటుతుంది. మనిషికి, ప్రకృతికి ఉండే అవినాభావ సంబంధాన్ని తెలుపుతుంది. ఆడబిడ్డకు, పుట్టినింటికి ఉండే రక్త సంబంధాన్ని వివరిస్తుంది. తెలంగాణ సమాజం వందల ఏళ్లుగా పర్యావరణ విలువలను కాపాడేందుకు చేస్తున్న గొప్ప ప్రయత్నం.

● నిరాడంబరత్వం, ప్రకృతిని కొలిచే విధానం ప్రస్ఫుటమవుతోంది. ప్రతి ఊర్లోనూ పండగను ఉమ్మడిగా చేసుకోవడం నాటి నుంచి అలవర్చుకోవడం విశేషం.

బహుళ ప్రాచుర్యంతోనే..



శాస్త్రీయంగానే కాకుండా మానవ సంబంధాలతో పెనవేసుకున్న బతుకమ్మ విశేషాలను అందరికీ తెలిసేలా ప్రాచుర్యం కల్పించాలని అంటున్నారు చేర్యాల మండలం ఆకునూరుకు చెందిన విష్ణుమూర్తి. కాకతీయ విశ్వవిద్యాలయంలో 'బతుకమ్మ పండుగ పాటలు (సంస్కృతి సంప్రదాయాలు)'పై పరిశోధన చేసి పుస్తకం వెలువరించారు. ఉపాధ్యాయుడిగా పని చేసి రెండేళ్ల కిందట పదవి విరమణ పొందారు.

పల్లె స్ఫూర్తితో ఆటా పాటలపై..

విష్ణుమూర్తిది పల్లె నేపథ్యం కావడంతో పండగలపై ఆసక్తి పెరిగింది. ప్రధానంగా ఊరంతా కలిసి చేసుకునే బతుకమ్మ గురించి తెలుసుకోవాలన్న ఉత్సుకత చూపారు. అదే దానిపై అధ్యయనం చేసేలా చేసింది. ఏయే ప్రాంతాల్లో ఈ పండగల ఎలా చేసుకుంటారో తెలుసుకున్నారు. ఆటాపాటలపై పరిశోధన చేశారు. బతుకమ్మ పండగ పూర్వ వైభవానికి ప్రత్యేక కార్యాచరణ అవసరమని గుర్తించారు. ప్రత్యేక నిధులు మంజూరు చేసి, ఊరూరా వేదికలు ఏర్పాటు చేయడంతో పాటు ఇంకెంతో చేయాలో తన పుస్తకంలో పొందుపరిచారు.

మరెన్నో విషయాలు

జానపద సాహిత్యం మొదలుకొని బతుకమ్మ పండగ స్వరూప స్వభావాలు, పాటల వర్గీకరణతో పాటు సంస్కృతి, సంప్రదాయం తదితర అంశాలను పుస్తకంలో వివరించారు. వ్యవసాయానికి స్త్రీ, పురుష సంబంధాలు- సాంఘిక జీవనం, జానపదుల నమ్మకాలు, దుస్తులు, ఆభరణాలు, ఆహారం, ఆటలు, వినయం వంటివెన్నో ఉన్నాయి. పండగ పాటలు, సంగీత నృత్య విశేషాలు, భాషావిశేషాలనూ క్షుణ్నంగా విపులీకరించారు. మహిళలు పాడే పాటల్లోని చంధస్సు, అలంకారాలు, సామెతలు, జాతీయాలు, నుడికారాలు, వర్ణాలు, వర్ణవ్యత్యయం, ప్రత్యాయాలు, నవ్యకల్పన, ఇష్ట దేవతాస్తుతి, మాండలికాలు ఇలాంటి విషయాలను పుస్తకంలో విశ్లేషించారు.



కాలినడకన కదిలి.. అమ్మను దర్శించి



భవానీమాత ఆలయం

దేశవ్యాప్తంగా దసరా సంబరాలు మొదలయ్యాయి. మహారాష్ట్రలోని తుల్జాపూర్ భవానీ మాత ఆలయంలో జరిగే ఉత్సవాలు తనివితీరా చూసి తీరాల్సిందే. ఉమ్మడి మెదక్ జిల్లాలోని జహీరాబాద్, నారాయణఖేడ్, అందోలు, నర్సాపూర్, వికారాబాద్ జిల్లా తాండూరు తదితర ప్రాంతాలకు చెందిన భక్తులెంతో మంది అమ్మను ఇలవేల్పుగా కొలుస్తుంటారు. దసరా సందర్భంగా ఆయా ప్రాంతాల నుంచి కాలినడకన ఆలయానికి వెళ్లి అమ్మను దర్శించుకొని మొక్కు చెల్లించుకుంటుంటారు. ఈసారి జాతరకు సైతం భారీగా ప్రజలు బృందాలుగా నడుచుకుంటూ ఆలయం బాట పట్టారు. వారంతా 65వ నంబరు జాతీయ రహదారిపై జహీరాబాద్ మీదుగా తుల్జాపూర్‌కు వెళ్తుంటారు. మూడు రోజులుగా ఆ రోడ్డంతా కిటకిటలాడుతోంది. దసరా మరుసటి రోజు వరకు ఈ సందడి కనిపిస్తుంది.

అత్యధికులు..

దసరా సందర్భంగా దుర్గమ్మ మండపాలు, ఇళ్లల్లో ప్రతిష్ఠించుకొని పూజించడం ఆనవాయితీ. జహీరాబాద్‌కు 180 కి.మీ. దూరంలో ఉన్న తుల్జాపూర్ భవానీమాతను దర్శించుకోవడం పవిత్రంగా భావిస్తారు. అత్యధికులు కాలినడకకే ప్రాధాన్యం ఇస్తారు. కొందరు మిత్రులతో కలిసి బృందంగా వెళ్తుంటారు.

అన్నదాన శిబిరాలు..

జహీరాబాద్‌కు చెందిన పలువురు భక్తుల కోసం అన్నదాన శిబిరాలు ఏర్పాటుచేస్తూ తమవంతు సహకారం అందిస్తున్నారు. జహీరాబాద్- తుల్జాపూర్ మధ్యలో 100కు పైగా శిబిరాలు వెలిశాయి. వీటిలో జహీరాబాద్, నారాయణఖేడ్ ప్రాంతాలకు చెందిన వారికే సగం వరకు ఉన్నాయి.

- న్యూస్‌టుడే, జహీరాబాద్

శరన్నవరాత్రి ఉత్సవాల్లో సామాజిక చైతన్యం



దుబ్బాక పట్టణంలోని 20వ వార్డులో యువకిరణం స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దుర్గామాత అమ్మవారి మండపాన్ని ఏర్పాటు చేశారు. శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. సభ్యులు కేవలం ఆధ్యాత్మిక కార్యక్రమాలే కాకుండా సామాజిక చైతన్యంపై దృష్టి సారించారు. నేడు సమాజాన్ని పట్టి పీడిస్తున్న డ్రగ్స్, గంజాయి, మత్తు పదార్థాలతో కలిగే అనర్థాలను వివరిస్తూ, 'మత్తు వదలరా' పేరిట భారీ ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. వీరు గతంలో వినాయక నవరాత్రి ఉత్సవాల్లో సైబర్ నేరాలు, ఓటు హక్కు వినియోగంపై అవగాహన కలిగించడం గమనార్హం.

- న్యూస్‌టుడే, దుబ్బాక

నాట్యమయూరి.. నివేదిత



ఓ వైపు నృత్యం.. మరోవైపు నటనలో రాణించడంతో పాటు చదువులో ముందంజలో ఉంటోంది ఈ బాలిక. అందరి మన్ననలు పొందుతున్న ఆ బాలికే సంగారెడ్డి జిల్లా కంగ్టికి చెందిన 12 ఏళ్ల నివేదిత. తల్లిదండ్రులు వడ్ల లత, దత్తాత్రి. తండ్రి రైల్వే ఉద్యోగి కాగా, తల్లి గృహిణి. ఉద్యోగరీత్యా హైదరాబాద్‌లో ఉంటున్నారు. తల్లిదండ్రులకు కూచిపూడిపై ఉన్న ఆసక్తితో కుమార్తెను ప్రోత్సహించారు. నాలుగేళ్ల వయసులోనే నివేదిత గురువు శ్రీనివాస్‌వరప్రసాద్ వద్ద ఓనమాలు నేర్చుకున్నారు. ఐదేళ్ల వయసు నుంచి ప్రదర్శన ఇవ్వడం మొదలుపెట్టారు. జాతీయ, అంతర్జాతీయస్థాయిలో 250కి పైగా ప్రదర్శనలు ఇవ్వడం విశేషం.

సంకల్పంతో సాధన

నివేదిత గచ్చిబౌలి కేంద్రీయ విద్యాలయంలో 7వ తరగతి చదువుతోంది. నిత్యం ఉదయం 5 గంటలకు సాధన చేస్తారు. సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు శిక్షణకు వెళ్తున్నారు. నృత్యం, మోనో యాక్షన్‌లో ఏకకాలంలో రాణిస్తున్నారు. నాలుగేళ్ల కిందట తానా ఆధ్వర్యంలో నిర్వహించిన మోనో యాక్షన్ ఆన్‌లైన్ పోటీలో రాణిరుద్రమదేవిగా అభినయించి తొలి స్థానంలో నిలిచారు. ఈ పోటీలో 40 దేశాలకు చెందిన 680 మంది కళాకారులు పాల్గొన్నారు. నృత్యకళా బాలప్రతిభా మహోత్సవ్, భారత రంగస్థల, అఖిలనటరాజన్, అంతర సాంస్కృతిక సంస్థాన్, భారతీయ నృత్య సమ్మేళన్, సంస్కారభారతి, రాష్ట్రీయ కళామహోత్సవ్ తదితర అకాడమీలు నిర్వహించిన పోటీల్లో ప్రతిభచాటి బహుమతులు అందుకున్నారు. ఇటీవల మహానంది, బాలకళాశ్రీ నృత్య పురస్కారాలు అందుకున్నారు. 2024-25కు గాను బాల పురస్కారానికి నామినేషన్ వేశారు.

- న్యూస్‌టుడే, నారాయణఖేడ్, కంగ్టి

ద్విచక్ర వాహనం ఢీకొని ఒకరి దుర్మరణం

జిన్నారం, న్యూస్‌టుడే: సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం గడ్డపోతారం శివారులో ద్విచక్ర వాహనం ఢీకొని వృద్ధుడు మృతిచెందిన ఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.... విశాఖ జిల్లా అనకాపల్లికి చెందిన వీర్రాజు కుటుంబ సభ్యులతో 20 ఏళ్లుగా గడ్డపోతారంలో నివసిస్తూ.. స్థానిక పరిశ్రమలో పనిచేస్తున్నారు. శనివారం రాత్రి గడ్డపోతారం శివారు నుంచి వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన ద్విచక్రవాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ద్విచక్ర వాహనదారుడికీ తీవ్ర గాయాలవడంతో స్థానికులు సూరారంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. వీర్రాజుకు భార్య, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ ఘటనపై ఎటువంటి ఫిర్యాదు రాలేదని ఐడీఏ బొల్లారం పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మరొకరు..



వెంకటి

రామాయంపేట, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన రామాయంపేట మండల పరిధి అక్కన్నపేట శివారులో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అక్కన్నపేటకు చెందిన ముత్యం వెంకటి(38) రామాయంపేట పట్టణంలోని ఓ దుకాణంలో పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ క్రమంలోనే రామాయంపేట నుంచి ద్విచక్ర వాహనంపై అక్కన్నపేటకు వస్తున్నాడు. గ్రామ శివారులోని పకీరు సాబ్ గుట్ట వద్దకు రాగానే ఆయన ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో వెంకటి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య మంజుల, ఇద్దరు కుమారులు ఉన్నారు. తల్లి ఎల్లవ్వ ఆయనపైనే ఆధారపడి జీవిస్తోంది.

గుండెపోటుతో కానిస్టేబుల్ మృతి


ప్రభుత్వ లాంచనాలతో అంత్యక్రియలు



రవీందర్

తాండూరు టౌన్, న్యూస్‌టుడే: గుండెపోటుతో తాండూరు పట్టణంలోని షావుకార్‌పేట్‌కు చెందిన కానిస్టేబుల్ కావలి రవీందర్(38) మృతి చెందాడు. పెద్దేముల్ ఠాణాలో విధులు నిర్వహిస్తున్న ఆయన ఎప్పటిలాగే శనివారం విధులు ముగించుకుని సాయంత్రం ఇంటికి వచ్చారు. రాత్రికి భోజనం చేసి పడుకున్నారు. ఉదయం ఎంతకు నిద్ర లేవకపోవడంతో భార్య మహేశ్వరి స్థానికులను పిలవడంతో వారు వచ్చి అతడిని లేపే ప్రయత్నం చేశారు. లేవకపోవటంతో వెంటనే 108 వాహనంలో జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు చెప్పారు. దీంతో కుటుంబీకులు బోరున విలపించారు. రవీందర్‌కు ఎనిమిదేళ్ల కూతురు శ్రావ్య, నాలుగేళ్ల కొడుకు అభిరాం ఉన్నాడు. పట్టణంలోని గొల్లచెరువు శ్మశానవాటికలో ఆదివారం సాయంత్రం పోలీసులు అధికార లాంచనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, సీఐలు, ఎస్సైలు, కానిస్టేబుళ్లు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

అదృశ్యమై.. విగతజీవిగా లభ్యమై..



నర్సయ్య

చేగుంట, న్యూస్‌టుడే: అదృశ్యమైన వృద్ధుడు మృతిచెందిన ఘటన చేగుంట మండలం మక్కరాజుపేటలో జరిగింది. స్థానిక ఎస్సై చైతన్య రెడ్డి తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన నర్సయ్య(69) గత నెల 14న సాయంత్రం పొలం సమీపంలో ఉన్న పశువుల కొట్టం వద్దకు వెళ్లాడు. రాత్రి అయినా ఇంటికి తిరిగిరాలేదు. కుటుంబసభ్యులు బంధువులు, చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. ఆదివారం పొలం సమీపంలో ఉన్న కుంటలో కుళ్లిపోయిన స్థితిలో ఉన్న మృతదేహం ఉందని రైతులు గుర్తించి గ్రామస్థులకు సమాచారం అందించారు. విషయాన్ని కుటుంబీకులకు తెలపడంతో అక్కడికి వెళ్లి చూశారు. అదే రోజు ఇంటికి వచ్చే క్రమంలో కుంటలో జారిపడి.. మృతిచెంది ఉంటాడని తెలిపారు. కుటుంబసభ్యులు అంతటా వెతికినా.. కుంట వైపు వెళ్లకపోవటంతో ఆచూకీ లభించలేదన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికెన్ ధరలు			
ఫాంరేటు	114-00	డ్రెస్డ్	197-00
రిటైల్	136-00	స్కిన్‌లెస్	224-00

కుటుంబ కలహాలతో బలవన్మరణం

తూప్రాన్, న్యూస్‌టుడే: కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. తూప్రాన్ ఎస్ఐ శివానందం తెలిపిన వివరాలు.. సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం నెంటూర్‌కు చెందిన శ్రీశైలం(45) కొంతకాలంగా కుటుంబంతో కలిసి తూప్రాన్‌లో అద్దె ఇంట్లో ఉంటున్నాడు. కుటుంబంలో గొడవ జరగడంతో శనివారం అర్ధరాత్రి దాటాక ఓ గదిలోకి వెళ్లి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం తెలియజేశారు. ఈ విషయమై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మనస్తాపంతో మరొకరు..



కుమార్

నిజాంపేట, రామాయంపేట: కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తి మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్న సంఘటన నిజాంపేట మండల పరిధి నార్లాపూర్ గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ రెడ్డి వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మిరుదొడ్డి కుమార్(41) అనారోగ్యంతో బాధపడుతున్నాడు. తన కుటుంబ బాగోగులు సరిగా చూసుకోలేకపోతున్నానని మనస్తాపానికి గురయ్యాడు. ఈ క్రమంలో శనివారం ఇంట్లో నుంచి వెళ్లిన కుమార్ గ్రామ శివారులోని పొలంలో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం స్థానికులు గమనించడంతో విషయం వెలుగు చూసింది. భార్య మంజుల ఫిర్యాదుతో కేసు నమోదైంది.

సింగపూర్‌లో తీరొక్క పూలు.. పాటల హోరు

చేగుంట, న్యూస్‌టుడే: సింగపూర్‌లో సద్దుల బతుకమ్మ వేడుకలు శనివారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగాయి. అక్కడి తెలంగాణ కల్చరల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో వేలాదిగా పాల్గొన్నట్లు చేగుంట మండలం రుక్మాపూర్‌కు చెందిన టీసీఎస్ఎస్ ప్రధాన కార్యదర్శి బసికె ప్రశాంత్ రెడ్డి తెలిపారు. ఈ వేడుకల్లో పాల్గొనేందుకు ఆయన తల్లిదండ్రులు సైతం సింగపూర్‌కు వెళ్లారు. తీరొక్క పూలతో బతుకమ్మలను తయారు చేసి మూడు గంటల పాటు పాటలు పాడుతూ ఆడారు. చిన్నపిల్లలు, యువతులు, మహిళలు ఆనందోత్సవాల మధ్య పాల్గొన్నారు. అనంతరం బతుకమ్మలను నిమజ్జనం చేశారు.



పట్టుదలతో సాగితే విజయం ఖాయం



జ్యోతి వెలిగించి పోటీలను ప్రారంభిస్తున్న మెదక్ మున్సిపల్ ఛైర్మన్ చంద్రపాల్, రమేశ్, ఆదర్శ్, పీడీలు



క్రీడా ప్రతిజ్ఞ చేస్తున్న క్రీడాకారిణులు

మెదక్ టౌన్, న్యూస్‌టుడే: పట్టుదలతో, శిక్షకుల సహకారంతో ముందుకు సాగితే విజయం ఖాయమని మెదక్ పురపాలిక అధ్యక్షుడు చంద్రపాల్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రం మెదక్‌లోని ఇందిరాగాంధీ మైదానంలో పాఠశాల క్రీడా సమాఖ్య (ఎస్జీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అండర్-17 బాలికల రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలను ఆయన జ్యోతి వెలిగించి ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. క్రీడా ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ.. క్రీడాకారులను రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాలుగా ప్రోత్సహిస్తోందన్నారు. పోటీల పరిశీలకులు ఆదర్శ్ మాట్లాడుతూ.. చదువుతో పాటు ఆటలపై దృష్టి సారించాలన్నారు. ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి రమేష్, తదితరులు మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా 10 ఉమ్మడి జిల్లాల నుంచి 180 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొంటున్నారు. ప్రతిభ చూపిన వారు రాష్ట్రస్థాయి జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నారు. ఇటీవల దక్షిణ కొరియాలోని సియోల్‌లో నిర్వహించిన స్లమ్ సాకర్ అంతర్జాతీయ ఫుట్‌బాల్ పోటీల్లో దేశం తరఫున పాల్గొన్న మెదక్ క్రీడాకారిణి కావేరికి.. చంద్రపాల్ టోపీ, బ్యాగ్ అందించి అభినందించారు. సమన్వయకర్త నాగరాజు, పీడీలు మాధవరెడ్డి, రాజేందర్, మహిపాల్, ప్రతాప్ సింగ్, రవి, సత్యం, మాలతి, లతీఫ్ తదితరులున్నారు.

● మెదక్ జట్టు నిజామాబాద్, హైదరాబాద్ జట్లతో రెండు మ్యాచ్‌ల్లో పోటీ పడగా మెదక్ విజయం సాధించింది. దీంతో సెమీఫైనల్ బెర్తు ఖాయం చేసుకుంది. ● ఖమ్మం-నిజామాబాద్ జట్ల మధ్య పోటీలో నిజామాబాద్, కరీంనగర్-నల్గొండ జట్ల మధ్య జరిగిన పోటీలో నల్గొండ విజయాలు సాధించాయి. రంగారెడ్డి - నల్గొండ జట్ల మధ్య పోటీ టై అయింది.

ప్రార్థనాలయం.. భక్తి పారవశ్యం



ప్రార్థనలో పాల్గొన్న భక్తులు

మెదక్ అర్బన్, న్యూస్‌టుడే: మెదక్ సీఎస్ఐ చర్చిలో ఆదివారం భక్తిపారవశ్యంతో కరుణామయుడి ప్రార్థనలు కొనసాగాయి. ఉమ్మడి మెదక్ జిల్లా వాసులతో పాటు ఆదిలాబాద్, కరీంనగర్, హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు, సందర్శకులు తరలివచ్చారు. ఏసయ్యను దర్శించుకొని ప్రార్థనలుచేపట్టారు. భక్తులు, పర్యాటకులతో మహాదేవాలయం సందడిగా మారింది. గురువులు శిలువను ఊరేగింపుగా తీసుకొచ్చి ప్రార్థనామందిరంలో ప్రతిష్ఠించి ఆరాధనలు చేపట్టారు. మెదక్ ప్రెసిబిటరీ ఇన్‌ఛార్జి శాంతయ్య, గురువు రిచర్డ్ దైవసందేశం వినిపించారు. భక్త బృందాలు ఆలపించిన పాటలు అలరించాయి. గురువులు జైపాల్, శ్రీనివాస్, చర్చి కమిటీ బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదానంలో పాల్గొన్న మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. అసోసియేషన్ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా సిద్దిపేట సర్వజన ఆస్పత్రిలోని రక్తనిధి కేంద్రంలో స్వచ్ఛందంగా 25 మంది యువకులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి శ్రావణి, అసోసియేషన్ అధ్యక్షుడు గందె సంతోష్‌కుమార్ మాట్లాడారు. రక్తదానం ప్రాణదానంతో సమానమన్నారు. మూడునెలకోసారి రక్తం ఇస్తే చెడు రక్తం పోయి మంచి రక్తం తయారవుతుందన్నారు. రక్తదానం చేస్తే అనారోగ్యానికి గురవుతామన్నది కేవలం అపోహ మాత్రమేనన్నారు. స్వచ్ఛందంగా ముందుకొచ్చి రక్తదానం చేసిన అసోసియేషన్ ప్రతినిధులను రక్తనిధి కేంద్రం నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు, రక్తనిధి కేంద్రం నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామికాభివృద్ధి.. ఉపాధికి పెన్నిధి

మెదక్ జిల్లాలో మల్టీ మోడల్ లాజిస్టిక్స్ పార్కు ఏర్పాటుకు అడుగులు

న్యూస్‌టుడే, తూప్రాన్, మనోహరాబాద్, వెల్దుర్తి

పారిశ్రామికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. అనువైన చోట మరిన్ని భూములు సేకరించి యువతకు ఉపాధి ఇచ్చేలా ప్రణాళిక రూపొందిస్తోంది. మెదక్ జిల్లా తూప్రాన్, మనోహరాబాద్ మండలాల్లో 150కి పైగా భారీ, మధ్య చిన్నతరహా పరిశ్రమలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలోనే కొత్తగా మనోహరాబాద్ మండలం పరికిబండ శివారులో 350 ఎకరాలకు పైగా సేకరించి అక్కడ లాజిస్టిక్ పార్కు ఏర్పాటుకు ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. ఇది అందుబాటులోకి వస్తే ఇక్కడి యువతకు ఉపాధి లభించే అవకాశం ఉంది.

పరికిబండ శివారులో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూమిలో లాజిస్టిక్స్ పార్కు ఏర్పాటుకు రాష్ట్ర మంత్రి మండలి తాజాగా ఆమోదముద్ర వేసింది. ఈ మేరకు రెవెన్యూ అధికారులు ఇక్కడ 72 ఎకరాల భూమిని గుర్తించారు. దీని దస్త్రాలు సిద్ధం చేసి టీఎస్ఐఐసీ అధికారులకు అప్పగించేందుకు కసరత్తు జరుగుతోంది.

ఇక్కడ లాజిస్టిక్స్ పరిశ్రమ ఏర్పాటైతే 3 వేల మందికి పైగా ఉపాధి లభించే అవకాశం ఉంది.

డ్రై పోర్టు..

లాజిస్టిక్ పార్కులో డ్రై పోర్టు నిర్మించనున్నారు. ఇక్కడి నుంచి రోడ్డు, రైలు, విమాన, సముద్రమార్గాల ద్వారా వస్తువుల ఎగుమతికి వీలుగా దీన్ని ఏర్పాటుచేస్తారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించనున్నాయి. డ్రైపోర్టు నిర్మాణంతో పర్యావరణానికి ఎలాంటి ఉంది. గోదాములు నిర్మిస్తారు.



పరికిబండ శివారులో టీఎస్ఐఐసీకి అప్పగించనున్న భూమి

234 ఎకరాలు..

పరిశ్రమల ఏర్పాటుకు గత ప్రభుత్వం ఈ ప్రాంతంలో 234 ఎకరాలను సేకరించారు. సాగులో ఉన్న రైతులకు ఎకరాకు రూ.19 లక్షలు, ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న భూములకు రూ.12.5 లక్షల చొప్పున మొత్తం రూ.42 కోట్లు పరిహారం అందజేశారు. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం పరికిబండ శివారులోనే 611, 209 సర్వే నంబరు మధ్యలో 72 ఎకరాలలో లాజిస్టిక్స్ పార్కు ఏర్పాటు కానుంది. సమీపంలో సేకరించనున్న 44 ఎకరాలు సేకరించనున్నారు.

మరికొన్ని చోట్ల

జిల్లాలోని మాసాయిపేట మండలం అచ్చంపేట, హకీంపేట, రామంతాపూర్ శివారులో 912 ఎకరాల అసైన్డ్ భూమిని, మనోహరాబాద్ మండలం పోతారం శివారులో 200కు పైగా ఎకరాలను సేకరించేందుకు ప్రభుత్వం ఆలోచన చేస్తోంది. గురువారం జరిగిన సమీక్షలో సంబంధిత అధికారులు వివరాలు సేకరించారు. తూప్రాన్ మండలం ఘనపూర్‌లో ఇప్పటికే భూసేకరణ పూర్తయింది.

నిరుద్యోగులకు మేలు: శ్రీరామ్, పరికిబండ



లాజిస్టిక్ పార్కు, ఇతర పరిశ్రమలు ఏర్పాటైతే నిరుద్యోగులకు మేలు. ఉద్యోగాలకు దూరం వెళ్లే బాధ తప్పుతుంది. ఇక్కడ నిర్మించే పరిశ్రమల్లో స్థానికులకు పెద్దపీట వేయాలి. అధికారులు త్వరగా పరిశ్రమలు ఏర్పాటయ్యేలా చర్యలు చేపట్టాలి.

భూ సేకరణ పూర్తి: జయచంద్రారెడ్డి, తూప్రాన్ ఆర్డీవో



పరికిబండ శివారులో మల్టీ మోడల్ లాజిస్టిక్స్ పార్కు నిర్మాణానికి భూ సేకరణ పూర్తి చేశాం. మెదక్ జిల్లాలో రైల్వే లైను, కొత్తగా రీజనల్ రింగు రోడ్డు రానున్న నేపథ్యంలో ఇక్కడ ఎక్కువ పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం మొగ్గు చూపుతోంది.


ఎంపీ బండి సంజయ్‌తో జీవాల కాపరులు, వెంకటేశం, నాయకులు

సమస్య పరిష్కరించాలని ఎంపీకి వినతి

కోహెడ, కోహెడ గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని ధర్మసాగర్‌పల్లి లెంకలపల్లి గుట్ట ప్రాంతానికి కంచె వేయకుండా అటవీశాఖ అధికారులకు సూచించాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కి స్థానిక జీవాల పెంపకందారులు కోరారు. శనివారం రాత్రి కరీంనగర్‌లోని మహాలక్ష్మి ఆలయంలో మండల భాజపా అధ్యక్షుడు ఖమ్మం వెంకటేశంతో కలిసి ఎంపీకి విన్నవించారు. వందల ఏళ్లుగా ఈ ప్రాంతాన్ని జీవాలు, పశువుల మేతకు వినియోగిస్తున్నామని అలాంటి ప్రాంతాన్ని అటవీ శాఖకు కేటాయించడంతో వారు కంచెలు వేస్తున్నారని వివరించారు. స్పందించిన బండి సంజయ్ సంబంధిత అధికారులతో మాట్లాడి వాస్తవ పరిస్థితులను తెలుసుకొని న్యాయం చేస్తానని జీవాల కాపరులకు హామీ ఇచ్చారు.

మహిళా ఓటర్లదే హవా!

జిల్లాలోని అన్ని మండలాల్లోనూ అదే పరిస్థితి

న్యూస్‌టుడే, హుస్నాబాద్, హుస్నాబాద్ గ్రామీణం, కోహెడ, న్యూస్‌టుడే: జిల్లాలో పురుషుల కంటే మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. అన్ని గ్రామాల ఓటర్ల జాబితాలోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. పంచాయతీ ఎన్నికల కోసం అధికారులు ఇటీవల విడుదల చేసిన ఓటర్ల జాబితాలను పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమవుతోంది. దీంతో త్వరలో జరగనున్న పంచాయతీ ఎన్నికల్లో మహిళలు కీలకపాత్ర పోషించనున్నారు.

హుస్నాబాద్ డివిజన్‌లో..

హుస్నాబాద్ నియోజకవర్గంలో హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ, చిగురుమామిడి, సైదాపూర్, భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండలాలతో పాటు, వేలేరు మండలంలోని రెండు గ్రామాలు ఉన్నాయి. వీటిలో సిద్దిపేట జిల్లా పరిధిలో హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ మండలాలు మాత్రమే ఉన్నాయి. ఈ మూడు మండలాలకు సంబంధించి పంచాయతీ ఎన్నికల కోసం ముసాయిదా ఓటరు జాబితాను గత నెల 13న విడుదల చేశారు. అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశాలు నిర్వహించి వారి నుంచి అభ్యంతరాలు స్వీకరించారు. వాటిని పరిష్కరించిన తర్వాత తుది ఓటర్ల జాబితాను గత నెల 28న విడుదల చేశారు. వార్డుల వారీగా ఇచ్చిన జాబితా ప్రకారం జిల్లా పరిధిలోని మూడు మండలాల్లో మొత్తం 81 గ్రామ పంచాయతీలు, 680 వార్డులు, 87,445 ఓటర్లు ఉన్నారు.

కోహెడలో అధికం

జాబితా ప్రకారం పురుషుల కన్నా మహిళా ఓటర్లే ఎక్కువగా ఉన్నారు. మూడు మండలాల్లో కలిపి మొత్తం ఓటర్లలో పురుషులు 43,403 ఉండగా, మహిళలు 44,071 ఉన్నారు. ఈ లెక్కల ప్రకారం పురుషుల కన్నా మహిళలు 668 మంది అధికంగా ఉన్నారు. పురుషుల కంటే హుస్నాబాద్ మండలంలో 263, అక్కన్నపేట మండలంలో 56, కోహెడ మండలంలో 349 మంది మహిళలు ఎక్కువగా ఉన్నారు. జిల్లాలోని అన్ని మండలాల్లో పురుషుల కన్నా మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు. ఇప్పటికే స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళలకు 50శాతం రిజర్వేషన్లు కల్పించారు. దీనికి తోడు మహిళా ఓటర్లు ఎక్కువగా ఉండటంతో పంచాయతీ ఎన్నికల్లో సర్పంచులు, వార్డు సభ్యులుగా పోటీ చేయడమే కాకుండా.. వారిని ఎన్నుకునే విషయంలోనూ వారు కీలకపాత్ర పోషించనున్నారు.


మల్లంపల్లిలో ఓటు వేసేందుకు వచ్చిన మహిళలు (ఫైల్)

ఓటర్ల వివరాలు

మండలం	పంచాయతీలు	వార్డులు	పురుషులు	మహిళలు
హుస్నాబాద్	17	140	8,589	8,852
అక్కన్నపేట	37	296	16,469	16,525
కోహెడ	27	244	18,345	18,694

మేమున్నాం.. మీకు తోడుగా

సిద్దిపేట టౌన్ 9963585053, జగదేవపూర్ 8008573209, హుస్నాబాద్ 8008573520, దుబ్బాక 9030037175, చేర్యాల 8008574871, గజ్వేల్ 9490675047 (10AM TO 1 PM)

దౌల్తాబాద్, న్యూస్‌టుడే: ? మండల పరిధిలోని లింగరాజుపల్లి ప్రాథమిక పాఠశాలకు ప్రహరీ లేక మూగజీవాలు సంచరిస్తుండడంతో విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. వెంటనే ప్రహరీ నిర్మించాలి. – సాయి, లింగరాజుపల్లి.

✔ ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తాం. – కనకరాజు, ఎంఈవో, దౌల్తాబాద్

జగదేవపూర్, న్యూస్‌టుడే: ? జగదేవపూర్ బస్టాండు వెనకాల వీధి దీపాలు లేక అంధకారం నెలకొంది. రాత్రి వేళల్లో అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారింది. – రాచకొండ లక్ష్మయ్య, జగదేవపూర్

✔ సమస్యను విద్యుత్తు శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి వీధిదీపాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. – సతీష్, పంచాయతీ, కార్యదర్శి, జగదేవపూర్

నిర్వాసితులకు ప్రత్యామ్నాయం చూపాలి: ఎమ్మెల్సీ


లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న యాదవరెడ్డి

గజ్వేల్, న్యూస్‌టుడే: పేదలను నిరాశ్రయుల్ని చేయకుండా హైడ్రా, మూసీ నిర్వాసితులకు ప్రభుత్వం ప్రత్యామ్నాయం చూపి ఆదుకోవాలని ఉమ్మడి మెదక్ జిల్లా భారాస ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లబ్ధిదారులకు ఆయన ఆదివారం గజ్వేల్‌లో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అభివృద్ధి పేరుతో పేదల ఇళ్లను కూల్చివేయడం సరికాదన్నారు. బాధితులకు ప్రత్యామ్నాయం చూపిన తర్వాత ఇళ్లను తొలగిస్తే బాగుంటుందన్నారు. అలా కాకుండా పేదలను భయభ్రాంతులకు గురిచేస్తూ బుల్డోజర్లను పంపటం సరికాదన్నారు.


గజ్వేల్, న్యూస్‌టుడే: గజ్వేల్ మండలం అహ్మదీపూర్‌కు చెందిన పలువురికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను గజ్వేల్ మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ మాదాసి శ్రీనివాస్ పంపిణీ చేశారు. మద్ది రాజిరెడ్డి, తదితరులున్నారు.

నిద్దరోతున్న నిఘా నేత్రాలు



నేరాల నియంత్రణలో కీలకమైన సీసీ కెమెరాల నిర్వహణలో అడుగడుగునా నిర్లక్ష్యం కన్పిస్తోంది. ప్రధాన కూడళ్లు, మార్గాల్లో ఏర్పాటు చేసిన నిఘా నేత్రాలు పలు కారణాలతో మరమ్మతులకు గురికాగా.. నెలలు గడిచినా వాటిని బాగు చేయడం లేదు. బెజ్జంకి మండల కేంద్రంలోని అంబేడ్కర్ కూడలిలో ఏర్పాటు చేసిన కెమెరాలు నిర్వహణ కొరవడి నేల చూపులు చూస్తున్నాయి. గతంలో ఇదే కూడలిలో పలు చోరీల కేసులను ఛేదించడంలో కెమెరాలు కీలకంగా పనిచేశాయి. శివాజీ, ఎడ్లబండి కూడళ్లు, ప్రభుత్వ జూనియర్ కళాశాల మార్గాల్లో గతంలో ఏర్పాటు చేసినవి సైతం పనిచేయడం లేదు. అధికారులు తక్షణమే సీసీ కెమెరాలకు మరమ్మతులు స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, బెజ్జంకి

ఏళ్ల కల.. నెరవేరే ఇలా!



కోహెడ మండలంలోని తంగళ్లపల్లి, శనిగరం గ్రామాల్లో రెండు వరుసల తారురోడ్డు పనులు ఎట్టకేలకు ఇటీవల పూర్తిచేశారు. ఏడాది కిందట రెండు గ్రామాల శివారులో రోడ్డు పూర్తిచేసి నివాస ప్రాంతాల మధ్య అలాగే వదిలిపెట్టారు. దీంతో పలుచోట్ల తారు పగిలి గుంతల్లో నీళ్లు నిలిచి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఇటీవల పనులు పూర్తి చేయడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. - **న్యూస్‌టుడే, కోహెడ గ్రామీణ**

గుంతల దారి ఇబ్బందిగా మారి



గుంతలుగా మారిన మట్టి రోడ్డుతో ఆ గ్రామస్థులు దశాబ్దాలుగా ఇబ్బంది పడుతున్నారు. మట్టిరోడ్డును బాగుచేయాలని అధికారులు, ప్రజాప్రతినిధులను ఎన్నిసార్లు కోరినా పట్టించుకునే వారే కరవయ్యారు. ములుగు మండలం లక్ష్మక్కపల్లి నుంచి వంటిమామిడి ఆర్ అండ్‌బీ రోడ్డు వరకున్న మట్టి రోడ్డు దుస్థితి ఇది. ఉన్నతాధికారులు స్పందించి ఈ మార్గంలో తారురోడ్డు నిర్మించాలని కోరుతున్నారు. ఇదే విషయమై ములుగు ఎంపీడీవో శర్మను వివరణ కోరగా.. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కరిస్తామన్నారు. –**న్యూస్‌టుడే, ములుగు**

మహమ్మద్ ప్రవక్త జీవితం అందరికీ ఆదర్శం


ఖురాన్ తెలుగు అనువాద పుస్తకాన్ని కత్తి కార్తీకకు అందజేస్తున్న మౌలానా మహమ్మద్ యూసఫ్, తదితరులు

దుబ్బాక, న్యూస్‌టుడే: మహమ్మద్ ప్రవక్త జీవితం అందరికీ ఆదర్శమని 'సదర్ అల్‌హాక్ ఎడ్యూకేషనల్ అండ్ వెల్ఫేర్ సొసైటీ' హైదరాబాద్ ప్రతినిధి మౌలానా మహమ్మద్ యూసఫ్ అన్నారు. ఆదివారం దుబ్బాక పట్టణంలోని ఒక ప్రవేట్ వేడుక మందిరంలో నిర్వహించిన జల్సా సీరతన్ నబీ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ముస్లింల పవిత్ర గ్రంథం ఖురాన్ తెలుగు అనువాద పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించి, భారాస రాష్ట్ర మహిళా నాయకురాలు కత్తి కార్తీకగౌడ్‌కు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కులమతాలకు అతీతంగా అందరూ సోదరభావంతో మెలిగినప్పుడే ప్రవక్త చెప్పిన ఆచరణ సాధ్యమవుతుందన్నారు. దుబ్బాక మజీద్ కమిటీ అధ్యక్షుడు ఎండీ ఖలీల్, వక్తలు అబ్దుల్ మొయిజ్, నయిమొద్దీన్, జాఫర్ మొయిజుద్దీన్, అన్ని మండలాల మజీద్ కమిటీ అధ్యక్షులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


సిద్దిపేట: మహాలక్ష్మి అలంకరణలో లలిత పరమేశ్వరి


సిద్దిపేట: మారుతినగర్‌లో అమ్మవారు


దౌల్తాబాద్: లలితా త్రిపుర సుందరిగా..


మర్పడ్గలో లలితా త్రిపుర సుందరిగా విజయదుర్గ


రాయపోల్: వడ్డేపల్లిలో అమ్మవారు


గజ్వేల్ గ్రామీణ: సంతోషిమాత ఆలయంలో..

మహాలక్ష్మి నమోస్తుతే

సిద్దిపేట, కొండపాక గ్రామీణం, రాయపోల్, గజ్వేల్ గ్రామీణ, మిరుదొడ్డి, న్యూస్‌టుడే: జిల్లాలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. సిద్దిపేటలోని లలితా పరమేశ్వరి ఆలయంలో ఆదివారం అమ్మవారు మహాలక్ష్మి అలంకరణలో దర్శనమిచ్చారు. భక్తులు కుంకుమార్చన, చండీ హోమం నిర్వహించారు. దౌల్తాబాద్, రాయపోల్, కొండపాక, గజ్వేల్, మిరుదొడ్డి మండలాల్లోని పలు గ్రామాల్లో అమ్మవారిని అందంగా అలంకరించారు. ఈ సందర్భంగా పలు ఆలయాల్లో వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ కుంకుమార్చన, అమృతాభిషేకం నిర్వహించారు.


సిద్దిపేట: కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు

ఆర్పీలకు అదనపు పనులు తగదు: సీఐటీయూ



నిరసన తెలుపుతున్న ఆర్పీలు

గజ్వేల్, న్యూస్‌టుడే: వేతనాలు అమలు చేయకుండా రిసోర్స్ పర్సన్స్(ఆర్పీ)లతో అదనపు పనులు చేయించడం ప్రభుత్వానికి తగదని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు సందెబోయిన ఎల్లయ్య అన్నారు. ఆదివారం గజ్వేల్‌లో ఆర్పీలు చేపట్టిన నిరసనలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. జీవో 60 ప్రకారం ఆర్పీలకు బీమా సౌకర్యంతోపాటు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎన్నికలు, సర్వే తదితర పనులకు ఆర్పీలను వినియోగిస్తూ పని ఒత్తిడి పెంచుతున్నారన్నారు. ఆర్పీలను ఆదుకుంటామని ప్రభుత్వం జీవోలు విడుదల చేస్తుంది కాని, దానిని అమలు చేయడం లేదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఆర్పీలకు నెలకు రూ.19,500 వేతనం చెల్లించాలన్నారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్త ఉద్యమం చేపడతామన్నారు. ఆర్పీల సంఘం గజ్వేల్ అధ్యక్షురాలు సుభద్ర, ఉపాధ్యక్షురాలు పద్మ, వరకుమారి, ప్రధాన కార్యదర్శి కల్పన, కోశాధికారి మనోహరి, కార్యదర్శులు సంధ్య, పావని, సభ్యులు ఫాతిమా, భవాని, కృష్ణలీల తదితరులు పాల్గొన్నారు.

సందడిగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం


బస్వాపూర్‌లో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

కోహెడ, న్యూస్‌టుడే: కోహెడ మండలం బస్వాపూర్ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో 2006-07లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకొని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం తమకు పాఠాలు బోధించిన గురువులను ఘనంగా సన్మానించారు.

చిన్నకోడూరు: చిన్నకోడూరు మండలంలోని రామంచ ఉన్నత పాఠశాలలో 1995-1996లో విద్యనభ్యసించిన పదో తరగతి పూర్వ విద్యార్థులంతా ఆదివారం ఒక చోటుకు చేరారు. సిద్దిపేట గ్రామీణ మండలం పుల్లూరులోని ఓ వేడుక మందిరంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం: భాజపా


సభ్యత్వ నమోదులో పాల్గొన్న దూది శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు

సిద్దిపేట, న్యూస్‌టుడే: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దూది శ్రీకాంత్‌రెడ్డి విమర్శించారు. సిద్దిపేటలోని భారత్‌నగర్‌లో భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజల కష్టాలను పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం కాలక్షేపం చేస్తోందన్నారు. రుణమాఫీ సంపూర్ణంగా అమలుకాక రైతులు ఆందోళనకు గురవుతున్నారని వాపోయారు. సిద్దిపేటలో ఆగిపోయిన అభివృద్ధి పనులను పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. నాయకులు బాసంగారి వెంకట్, టి.వెంకటేశం, రాజిరెడ్డి, లక్ష్మారెడ్డి, తదితరులు ఉన్నారు.

దేశసేవకు యువత ముందుకు రావాలి: ఆర్‌ఎస్‌ఎస్


మాట్లాడుతున్న రామకృష్ణ

జగదేవపూర్: యువత దేశ సేవకు అంకితం కావాలని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ తెలంగాణ సామాజిక సద్భావన సహప్రాంత ప్రముఖ్ నల్లాన్ చక్రవర్తుల రామకృష్ణ అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ స్థాపించి వందేళ్లు పూర్తవుతున్న సందర్భంగా జగదేవపూర్‌లో ఆదివారం ర్యాలీ నిర్వహించి ఓ వేడుక మందిరంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు పాములపర్తి ప్రభాకర్ రెడ్డి, జిల్లా గ్రామీణ వికాస్ ప్రముఖ్ వంటేరు నరేందర్ రెడ్డి, భాజపా నాయకులు పాల్గొన్నారు.

చేర్యాల: ఆర్‌ఎస్‌ఎస్ వందేళ్ల ఉత్సవాల్లో భాగంగా చేర్యాలలో పథ సంచలన్ నిర్వహించారు. దాదాపు వంద మంది సంఘ ప్రతినిధులు, సభ్యులు ఘనవేష్ ధరించి జాతీయ రహదారిపై భారీ ర్యాలీ నిర్వహించారు.

అల్లీపూర్ సొసైటీ ఛైర్మన్, సీఈవోపై చర్యలకు వినతి

చిన్నకోడూరు, న్యూస్‌టుడే: అల్లీపూర్ సొసైటీలో నిధుల దుర్వినియోగానికి పాల్పడిన ఛైర్మన్, సీఈవోపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ డైరెక్టర్ నముండ్ల రామచంద్రం డిమాండ్ చేశారు. చిన్నకోడూరులోని సొసైటీ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడారు.. అక్రమాలకు బాధ్యులైన వారికి గతంలో అధికారులు నోటీసులు జారీ చేసినప్పటికీ డబ్బులు రికవరీ చేయలేదన్నారు. సీఈవోను తొలగించి కొత్త వారిని నియమించాలని పాలకవర్గ సభ్యులు గత నెలలో డీసీవో కార్యాలయంలో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. ఛైర్మన్, వైస్ ఛైర్మన్లపై అవిశ్వాస తీర్మానం ప్రకటించిన పత్రాన్ని డీసీవోకు అందజేసినట్లు తెలిపారు.

9న అక్కారంలో బహుజన బతుకమ్మ

గజ్వేల్: యువజన సంఘాల ఆధ్వర్యంలో గజ్వేల్ మండలం అక్కారంలో ఈ నెల 9న బహుజన బతుకమ్మ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు ఆదివారం గోడపత్రికలు విడుదల చేశారు.

హుస్నాబాద్ గ్రామీణం: హుస్నాబాద్ మండలం పందిల్లలోని జీ5 టౌన్‌షిప్ ఆధ్వర్యంలో ఈ నెల 9న మహిళలు, పిల్లలకు వివిధ రకాల పోటీలు నిర్వహిస్తున్నట్లు సంస్థ ప్రతినిధి శ్రీనివాసరెడ్డి తెలిపారు. బతుకమ్మ, దసరా పండగ సందర్భంగా నిర్వహించే పోటీలలో మహిళలు, పిల్లలు పాల్గొనవచ్చన్నారు. గెలుపొందిన వారికి ప్రథమ బహుమతిగా 5 గ్రా. బంగారంతో పాటు వంట సామగ్రి, చీరలు, పిల్లలకు 5 రేంజర్ సైకిళ్లు ఇస్తామన్నారు.

పట్టభద్రుల ఓటు నమోదుకు ఉచిత సెంటర్లు

గజ్వేల్, న్యూస్‌టుడే: పట్టభద్రులు తమ ఓటును నమోదు చేసుకునేందుకు గజ్వేల్‌లో ఉచిత సెంటర్లను ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేయనున్న ప్రసన్నహరికృష్ణ టీం సభ్యులు మల్లికార్జున్, సాదిక్ తెలిపారు. గజ్వేల్‌లోని అయ్యప్ప దేవాలయం ఎదురుగా ఉన్న విద్యార్థి బుక్‌డిపో, సంగాపూర్ రోడ్డులోని గ్లోబల్ కంప్యూటర్ సెంటర్, పెంటాచారీ ఆస్పత్రి సమీపంలోని వెంకటేశ్వర కమ్యునికేషన్ సెంటర్లలో ఉచితంగా ఓటును నమోదు చేసుకోవాలని వారు కోరారు.

నూలు కేంద్రం ఏర్పాటుపై హర్షం

హుస్నాబాద్ గ్రామీణం: చేనేత, పవర్‌లూమ్ కార్మికుల కోసం వేములవాడలో నూలు కేంద్రం ఏర్పాటు చేయడంపై టీపీసీసీ చేనేత విభాగం రాష్ట్ర ప్రతినిధి గాజుల భగవాన్ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. నూలు కేంద్రం ఏర్పాటుకు బీసీ సంక్షేమశాఖ నిధుల నుంచి కార్పస్ ఫండ్ కింద రూ.50కోట్లు విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఇందుకు కృషిచేసిన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు నాగేశ్వర్‌రావు, ప్రభాకర్, ప్రభుత్వ విప్ శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

అక్కన్నపేట(హుస్నాబాద్ గ్రామీణం), న్యూస్‌టుడే: అక్కన్నపేట మండల పరిషత్తు కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న దానబోయిన వెంకటేశ్(52) ఆదివారం మృతి చెందారు. ధూల్మిట్ట మండలం లింగాపురం వారి స్వగ్రామం. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. బాధిత కుటుంబాన్ని మాజీ ఎంపీపీ మాలోతు లక్ష్మి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు బీలునాయక్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పరామర్శించారు. మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు.

లారీని ఢీకొన్న కారు.. ముగ్గురికి గాయాలు

కొండపాక గ్రామీణం, న్యూస్‌టుడే: లారీని వెనుక నుంచి కారు ఢీకొన్న ఘటనలో ముగ్గురికి గాయాలైన ఘటన కొండపాక మండలం రవీంద్రనగర్‌లో ఆదివారం చోటుచేసుకుంది. కొండపాక 108 అంబులెన్స్ సిబ్బంది తెలిపిన వివరాలు.. దుబాయ్ నుంచి హైదరాబాద్ వచ్చిన బెజ్జంకి మండలం వడ్లూరు గ్రామానికి చెందిన శేఖర్(26)ను ఇంటికి తీసుకురావడానికి అతని స్నేహితులు అజయ్(28), సతీష్(28) కారులో హైదరాబాద్ వెళ్లారు. హైదరాబాద్‌లో శేఖర్‌తో కలిసి ముగ్గురు కారులో ఇంటికి తిరుగు పయనమయ్యారు. వీరి కారు కొండపాక మండలం రవీంద్రనగర్ శివారులో రాజీవ్ రహదారిపై వస్తుండగా ముందు వెళ్తున్న లారీ డ్రైవర్ ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో వీరి కారు అదుపుతప్పి లారీని ఢీకొట్టింది. దీంతో కారు ముందుభాగం ధ్వంసమై ముగ్గురు గాయపడ్డారు. సమాచారం అందుకున్న అంబులెన్సు సిబ్బంది ఘటనా స్థలికి చేరుకొని క్షతగాత్రులకు ఆసుపత్రికి తరలించారు.

కాంగ్రెస్ హయాంలోనే అభివృద్ధి: గోపీకృష్ణ

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల వారిని ఆదుకుంటుందని యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూజల గోపీకృష్ణ అన్నారు. పట్టణంలోని గుండ్లచెరువులో ఆదివారం పెంతకోస్ చర్చిని సందర్శించారు. ఈ సందర్భంగా చర్చిలో ఉన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరుతూ ఆయనకు చర్చి నిర్వాహకులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కలీమొద్దీన్, బుచ్చిరెడ్డి, సాకి ఆనంద్, మిద్దెరవి, మంద పాండు తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణను వెంటనే అమలు చేయండి

గజ్వేల్: ఎస్సీ వర్గీకరణను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని, ఇందుకు ఎస్సీ ఉపకులాలు పూర్తి సహకారం అందించాలని మాదిగ ఉద్యోగుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేబర్తి యాదగిరి విజ్ఞప్తి చేశారు. ఆయన ఆదివారం గజ్వేల్‌లో మాట్లాడుతూ.. అసెంబ్లీ సాక్షిగా సీఎం రేవంత్‌రెడ్డి వర్గీకరణను త్వరగా పూర్తి చేస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు. దళితుల ఉమ్మడి సమస్యలను పరిష్కరించుకునేందుకు మందకృష్ణ మాదిగ నేతృత్వంలో చేపట్టే ఉద్యమానికి అందరూ కలిసి రావాలన్నారు. మాదిగ ఉద్యోగ సమాఖ్య రాష్ట్ర నాయకులు నాగభూషణం, మహేశ్, గంగాధర్, తదితరులున్నారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి

సిద్దిపేట, న్యూస్‌టుడే: తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో ప్రైవేటు, ప్రభుత్వ రంగ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పోరాటం కొనసాగిస్తానని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేయాలనుకుంటున్న జగ్గు మల్లారెడ్డి తెలిపారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం మాట్లాడారు. నూతన విద్యావిధానంపై ప్రభుత్వం స్పష్టతనివ్వాలని, ఎస్‌ఎస్‌సీ, ఇంటర్ బోర్డు ఉంటుందా? లేదా తెలపాలన్నారు. డీటీఎఫ్, పీడీఎస్‌యూ, ప్రైవేటు పాఠశాలల యాజమాన్య సంఘం ప్రతినిధులు తదితరులు ఉన్నారు.

వేంకటేశ్వరాలయంలో చండీ హోమం


హోమంలో పాల్గొన్న భక్తులు

నంగునూరు, న్యూస్‌టుడే: అమ్మవారి అనుగ్రహంతో ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలని చండీ హోమం నిర్వహిస్తున్నట్లు పూజారి రణధీరచార్యులు అన్నారు. ఆదివారం మండల పరిధి పాలమాకులలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సామూహిక చండీ హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాదం అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు దుర్గయ్య, రామానుజం, మల్లేశం, బుచ్చిరెడ్డి, అశోక్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందన

సిద్దిపేట టౌన్: సిద్దిపేటలో ఇటీవల నిర్వహించిన ఉమ్మడి మెదక్ జిల్లా అండర్-14 క్రికెట్ ఎంపికల్లో నారాయణరావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి రామ్‌చరణ్ రాష్ట్ర స్థాయికి ఎంపికవడం పట్ల పాఠశాల ఉపాధ్యాయ బృందం అభినందించింది. ఈ మేరకు ఆదివారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగరాజు, పాఠశాల ఆదర్శ కమిటీ, ఉపాధ్యాయ బృందం రామ్‌చరణ్‌ను అభినందించారు.

వానొచ్చిందా.. వాగు గండం!

న్యూస్‌టుడే, జగదేవపూర్: వర్షాకాలం వచ్చిందంటే చాలు ఆ ఊరి ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఎప్పుడు వరద ముంచుకొస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. దశాబ్దాలుగా కొనసాగుతున్న ఈ సమస్యలకు పరిష్కారం చూపేవారే లేరా అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జగదేవపూర్ మండలం మునిగడప గ్రామం మధ్య నుంచి ఓ పెద్ద కాలువ(పీతిరి వాగు) ప్రవహిస్తోంది. ఏడాది పొడవునా వ్యర్థాలు వాగులో వేస్తుండడంతో వర్షాలు కురిసినప్పుడు నీటి ప్రవాహానికి అడ్డుగా మారి చెత్త చెదారం కుళ్లి కంపు కొడుతోంది.

శాశ్వత పరిష్కారం చూపితే మేలు

గతంలో వరదలొచ్చినప్పుడు కోళ్లు, మేకలు, శునకాలు వరదలో కొట్టుకుపోయాయి. కొద్దిపాటి వర్షం పడినా వరద ఇళ్లలోకి వస్తుండడంతో ప్రజలు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. వర్షాలు ఆగిపోయాక రెండు, మూడు నెలల వరకు నీరు నిల్వ ఉండడంతో దోమల ఉద్ధృతి పెరిగి గ్రామస్థులకు కంటిమీద కునుకు ఉండడం లేదు. దాదాపు ఒకటిన్నర కిలోమీటర్ల పొడవున్న ఈ వాగులోని మలినాలు గ్రామ పడమర వైపు ఉన్న పెద్ద చెరువులో కలిసి నీటిని కలుషితం చేస్తున్నాయి. వాగుకు సిమెంటు లైనింగ్ నిర్మించి శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్థులు కోరుతున్నారు.


మునిగడపలో మధ్యలో ఉన్న వాగు